
# సాక్షి పల్నాడు

మంగళవారం | 1 | అక్టోబర్ | 2024

## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 588.90 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 10,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



## వాహనాల తనిఖీ

మాచర్ల: పట్టణంలోని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషారెడ్డి సోమవారం గుంటూరు, శ్రీశైలం, సాగర్ ప్రధాన రహదారిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు.



## పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 31,991 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 36,887 క్యూసెక్కులు వదులుతున్నారు.

## న్యూస్‌రీల్

### న్యాయమూర్తి ఆకస్మిక తనిఖీలు



వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు వినుకొండ మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్‌పర్సన్, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎం.మహతి ప్యానల్ న్యాయవాదులతో కలిసి మండలంలోని విఠంరాజుపల్లి గ్రామంలోని సెయింట్ ఆన్స్ ఉషోదయ స్పెషల్ స్కూల్, నరసరావుపేట రోడ్డులోని బీసీ బాలుర హాస్టల్ స్కూల్, కాలేజీ, సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు ప్రతిరోజూ అందిస్తున్న మెనూను పరిశీలించి, సక్రమంగా అమలవుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకొని క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. బార్ అసోసియేషన్ సెక్రటరీ పఠాన్ గౌస్ మొహిద్దీన్‌ఖాన్, పి.వి.రమణారెడ్డి, ప్యానల్ న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

### విజన్-2047పై జిల్లా స్థాయి పోటీలు




నరసరావుపేట ఈస్ట్: విద్యార్థుల్లో అవగాహన పెంపుదలలో భాగంగా రాష్ట్ర దార్శనిక పత్రం -2047 అంశంపై సోమవారం విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వం, బృంద చర్చ విభాగాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో వివిధ మండలాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు హాజరయ్యారు. వ్యాసరచనలో ప్రథమ బహుమతి ఎస్.శృతిలయ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గురజాల, ద్వితీయ బహుమతి ఎం.హరిణి, జడ్పీ హైస్కూల్, గణపవరం, తృతీయ బహుమతి బి.రమ్య, శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్, అమరావతి సాధించారని తెలిపారు. వక్తృత్వంలో ఎం.శివసాయిశంకర్, జడ్పీ హైస్కూల్, శంకరభారతీపురం, జె.జయశ్రీ, ఏపీ మోడల్ స్కూల్, కండ్లకుంట, సిహెచ్.శృతిశ్రీ, జడ్పీ హైస్కూల్ కాకాని, బృందచర్చలో జి.మౌనిక, ఓ.హేమలత ప్రథమ, ఏ.నాగరూప, సిహెచ్.రాజేశ్వరి ద్వితీయ, కె.ఎస్తేరురాణి, పి.నందిని తృతీయ బహుమతులు సాధించినట్టు వివరించారు.

### యార్డుకు 52,124 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 52,124 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 45,264 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.8,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,000 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 9,000 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,500 నుంచి రూ. 18,500 వరకు పలికింది. తాలు రకానికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 27,326 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

### సాగునీటి సమాచారం



తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 5000 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 186, బ్యాంక్ కెనాల్‌కు 1,122, తూర్పు కెనాల్‌కు 105, పశ్చిమ కెనాల్‌కు 60, నిజాంపట్నం కాలువకు 116, కొమ్మమూరు కాలువకు 2280 క్యూసెక్కులు విడుదల చేశారు.

# బైపాస్‌కు సోలార్ వెలుగులు



చిలకలూరిపేట బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు

- జాతీయ రహదారికి ఇరువైపులా 16 కిలోమీటర్ల పరిధిలో సోలార్ లైట్లు
- మూడువేల మొక్కలతో గ్రీనరీ, టర్ఫింగ్ గ్రాస్ ఏర్పాటు
- ఈ నెలాఖరునాటికి పూర్తికానున్న బైపాస్ పనులు



బైపాస్ వెంబడి సోలార్ ప్యానళ్ల ఏర్పాటు పనులు

నాదెండ్ల: చిలకలూరిపేట బైపాస్ రోడ్డులో సోలార్ వెలుగులు విరజిమ్మనున్నాయి. యడ్లపాడు మండలం తిమ్మాపురం నుంచి చిలకలూరిపేట రూరల్ మండలం తాతపూడి గ్రామం వరకు 16.5 కిలోమీటర్ల పొడవునా బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. సుమారు రూ.900కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఆరులైన్ల బైపాస్‌రోడ్డుకు ఇరువైపులా సర్వీసు రోడ్డులున్నాయి. వీటి వెంబడి సోలార్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డు పరిధిలో రెండు చోట్ల సోలార్ ప్యానెళ్ల ఏర్పాట్లకు సిద్ధం చేస్తున్నారు. పగలు సూర్యరశ్మి నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేయనున్నారు. రాత్రిళ్లు గ్రిడ్ నుంచి విద్యుత్ తీసుకుని వీధిలైట్లు వెలగనున్నాయి. దేశవ్యాప్తంగా ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారులతో పాటూ ఇప్పటికే ఉన్న రహదారుల వెంబడి సోలార్ వీధిలైట్లు ఏర్పాటు చేయనున్నట్లు నేషనల్ హైవేస్ అధికారులు తెలిపారు.

**సుందరంగా మారనున్న బైపాస్...**

బైపాస్ రోడ్డు ఇరువైపులా గానుగ, వేప, నల్లమద్ది, గుల్మోరా, పెంట్‌ఫామ్ జాతుల మొక్కలు నాటడం ప్రారంభించారు. సుమారు మూడున్నర వేల మొక్కలు నాటనున్నారు. దీనితో పాటూ రోడ్డుకు ఇరువైపులా అంచుల వెంబడి గ్రీన్ టర్ఫింగ్ గ్రాస్ ఏర్పాటు చేయనున్నారు. రహదారి ఆక్రమణలకు గురికాకుండా రెండు వైపులా ప్రహరీ గోడ నిర్మిస్తున్నారు. ప్రతి మొక్కకు ట్రీగార్డ్ ఏర్పాటు చేసి మొక్కలు చెట్లయ్యే వరకూ సంరక్షించనున్నారు. వీటికి ప్రతినిత్యం నీటిని అందించేందుకు రెండు చోట్ల బోరు పాయింట్లు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించనున్నారు. హైవే అధికారులు స్వచ్ఛతా హీ సేవలో భాగంగా గత నెల 17న మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. అక్టోబర్ చివరి నాటికి రోడ్డు పనులు పూర్తికానున్నట్లు అధికారులు తెలిపారు.

### రెండు నెలల్లో పూర్తి



నేషనల్ హైవే-16 చిలకలూరిపేట బైపాస్ రోడ్డుకు సోలార్ విద్యుత్ లైట్ల వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నాం. రోడ్డు వెంబడి రెండుచోట్ల సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించి, రాత్రిళ్లు గ్రిడ్ నుంచి విద్యుత్ వినియోగించుకోనున్నాం. మరో రెండు నెలల్లో సోలార్ వ్యవస్థ ఏర్పాటు పూర్తి కానుంది. రహదారి వెంబడి గ్రీనరీతో ఆకర్షణీయంగా రూపొందించనున్నాం.

– మోహన్ మురళీ, చిలకలూరిపేట బైపాస్ రోడ్డు ప్రాజెక్టు డైరెక్టర్

# గడువులోపు అర్జీలు పరిష్కరించాలి

**ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు**



కలెక్టర్ అరుణ్‌బాబుకు తమ సమస్య విన్నవిస్తున్న బాధితుడు

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టరు పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, ఇతర అధికారులతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలచే 101 వినతులు స్వీకరించారు. డీఆర్‌ఓ కె.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్ పాల్గొన్నారు.

**పొలం తమదని బెదిరిస్తున్నారు**

నాకు కొచ్చర్లలో పూర్వార్జితంగా 1.98 ఎకరాల పొలం ఉంది. దీని పక్కనే కేవలం 70సెంట్లు ఉన్న రామకోటయ్య, రాంబాబు అనే వ్యక్తులు నా పొలం కూడా తమదేనని, పొలంలోకి వస్తే అంతు చూస్తామంటూ బెదిరిస్తున్నారు. ఆ పొలం నాదేనని సంబంధిత పత్రాలతో కలెక్టర్‌కు నివేదిస్తున్నా.

– సాదుపేట నాగశ్రీను, కొచ్చర్ల, ఈపూరు మండలం

**కన్న కొడుకులు ఆస్తిపత్రాలు తీసుకొని చూడట్లేదు**

నాకు ఆరేళ్ల కిందట పక్షవాతం వచ్చింది. కొంతమేర కోలుకున్నా. నాకు ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి. ఇద్దరు కొడుకులు నా పేరుపై ఉన్న ఇంటి పత్రాలు తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లగొట్టారు. బతుకు దెరువులేదు. ఆ పత్రాలు ఇస్తే అమ్ముకొని జీవిస్తా. నాకు ఆ పత్రాలు ఇప్పించండి.

– చుక్క జార్జి, మల్లవోలు, మాచవరం మండలం

**మూడు సెంట్ల స్థలం ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు**

నాకు సత్తెనపల్లి రోడ్డులోని సాయిబాబా దేవాలయం వెనుక ఉన్న మెడికల్ కాంప్లెక్స్ వద్ద మూడు సెంట్ల స్థలం ఉంది. దీనిని సత్యనారాయణ, వెంకట నాగరాధిక ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. దీనికి పట్టణ సర్వేయర్లు సహకారం అందజేస్తున్నారు. ఆ స్థలాన్ని కాపాడి నాకు రక్షణ కల్పించండి.

– నక్కా థామస్, మాజీ డీలర్, నరసరావుపేట

# నేటి నుంచి రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలు



రాష్ట్రస్థాయి పోటీలకు ముస్తాబైన పెద్దమక్కెన క్రీడాప్రాంగణం

సత్తెనపల్లి: సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో అక్టోబర్ 1 నుంచి రెండు రోజులపాటు 28వ రాష్ట్రస్థాయి అండర్-19 సెపక్ తక్రా బాల, బాలికల రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి 13 జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు, అధికారులు హాజరు కానున్నారు. సత్తెనపల్లి ప్రగతి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగనున్నాయి. దీనిలో భాగంగా సోమవారం క్రీడా ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. అంతేగాక పోటీలకు హాజరయ్యే బాలబాలికలకు భోజనం, వసతులు కల్పించనున్నారు. మంగళవారం ఈ పోటీలను సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించనున్నారు. అక్టోబర్ 2న పోటీల ముగింపులో భాగంగా విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరుకానున్నారు. రాష్ట్రస్థాయి పోటీల ఏర్పాట్లను ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.నరసింహారావు పర్యవేక్షించారు. ఆయనతో పాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ కార్యదర్శి అనిల్ దత్తానాయక్, మండల కార్యదర్శి లాకు పిచ్చియ్య, పీడీ పుచ్చకాయల శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

# 'కోత'ల ప్రభుత్వం

- ఈనెలలో 1135 మందికి పింఛన్ల కోత
- టీడీపీ కూటమి ప్రభుత్వంలో నెలనెలా తగ్గుతున్న పింఛన్లు
- నాలుగు నెలల్లో జిల్లాలో 5977 మంది తగ్గుదల

**జిల్లాలో పింఛనుదారులు ఇలా..**

| నియోజకవర్గం | జూలై | అక్టోబరు |
|---|---|---|
| చిలకలూరిపేట | 37,982 | 37,204 |
| గురజాల | 44,026 | 43,052 |
| మాచర్ల | 43,520 | 42,575 |
| నరసరావుపేట | 33,622 | 32,921 |
| పెదకూరపాడు | 40,264 | 39,404 |
| సత్తెనపల్లి | 40,559 | 39,728 |
| వినుకొండ | 42,153 | 41,265 |
| మొత్తం | 2,82,126 | 2,76,149 |

నరసరావుపేట: తాము అధికారంలోకి వస్తే అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందజేస్తామన్న టీడీపీ కూటమి నాయకులు తీరా వచ్చిన తర్వాత ఏదో ఒక నెపంతో సామాజిక భద్రతా పింఛన్లను తగ్గిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి..ఈ నెలలో జిల్లాలో తాజాగా 1135 మందికి కోత విధించగా గడిచిన నాలుగు నెలల కాలంలో 5,977 మందికి పింఛన్ తగ్గిపోయాయి. జూన్ 12వ తేదీన నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా కూటమి ప్రభుత్వం కొలువుతీరింది. జూన్‌కు సంబంధించి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంపికచేసిన లబ్ధిదారులకే పింఛన్ సొమ్ము మంజూరైంది. నూతన ప్రభుత్వం జూలై మాసానికి జిల్లాలో 2,82,126 మందికి అన్నిరకాల పింఛన్లు పెంచి అందజేస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబరు వచ్చేసరికి వాటి సంఖ్య 2,76,149మందికి తగ్గింది. గత నాలుగు నెలల వ్యవధిలో సుమారుగా 5,977మంది పింఛన్‌దారులు తగ్గిపోయారు. వీరిలో కొంతమంది మృతిచెందారనుకున్నా అంతమంది తగ్గే అవకాశం లేనేలేదు.

**పింఛనుదారులకు నోటీసులు**

వినుకొండ నియోజకవర్గం శావల్యాపురం మండలంలోని కొన్ని గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మీకు పింఛన్ ఎందుకు నిలుపుదల చేయకూడదంటూ ఎంపీడీఓలు పింఛన్ నోటీసులు అందజేశారు. దీనిపై ఆగస్టు 12వ తేదీ సోమవారం ఆ మండలంలోని పిచికలపాలెంకు చెందిన కొంతమంది బడుగు బలహీన వర్గాల వారు కలెక్టర్ ప్రజాసమస్యల వేదికకు హాజరై తమకు నోటీసులు ఇవ్వటాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. జూలై నుంచి అక్టోబరు నెలలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల వారీగా పింఛన్లు పొందిన లబ్ధిదారుల సంఖ్యలో వచ్చిన తేడా వివరాలు ఈవిధంగా ఉన్నాయి. దీనిపై డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా తాను వీసిలో ఉన్నానని, తర్వాత స్పందిస్తానని చెప్పారు.

# పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అభిప్రాయాలు తెలపండి

**రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరిన జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు**



కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలో అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై రాజకీయ పార్టీల ప్రతినిధులు అభిప్రాయాలు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ అంశంపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. నరసరావుపేట నియోజకవర్గంలో నాలుగు అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు, ఆరు పోలింగ్ కేంద్రాల చిరునామాల మార్పు, చిలకలూరిపేట నియోజకవర్గంలో ఒక అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు, నాలుగు పోలింగ్ కేంద్రాల భవనాల మార్పు, ఒక పోలింగ్ కేంద్రం అడ్రస్ మార్పులకు సంబంధించి ప్రతిపాదనలను రాజకీయ పార్టీల ముందుంచి అభిప్రాయసేకరణ కోరారు. నిబంధనల మేరకు జిల్లాలో 1500కి పైబడి ఓట్లున్న పోలింగ్ కేంద్రానికి అదనంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు విషయంలో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లను వేర్వేరు పోలింగ్ కేంద్రాలకు కేటాయించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలిచ్చామన్నారు. పలు పాఠశాలలు, భవనాల పేర్లు మారినందున వాస్తవంగా పోలింగ్ కేంద్రం అదే అయినప్పటికీ రికార్డులలో వాటి చిరునామాలు మార్చుకోవాల్సివస్తోందన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై అక్టోబరు 3వతేదీ నాటికి రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను సహేతుక కారణాలతో సహా వివరించాలన్నారు. నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల ఆర్డీఓలు మధులత, రమణాకాంత్‌రెడ్డి, మురళీకృష్ణ, ఇతర నియోజకవర్గాల ఈఆర్వోలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**పింఛన్ల పంపిణీ సజావుగా జరగాలి**

ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ సజావుగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, అధికారులతో పింఛన్ల పంపిణీపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

### జిల్లాలో 129 మద్యం షాపులు

ప్రభుత్వం త్వరలో మద్యం నోటిఫికేషన్ విడుదల చేయనుందని, మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ కట్టుదిట్టంగా, భద్రతా చర్యలు పాటిస్తూ పూర్తిగా పారదర్శకంగా జరగాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తావివ్వక అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టరు పి.అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం మద్యం దుకాణాల పాలసీపై జిల్లా కలెక్టర్ సంబంధిత ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2024 ఏడాది రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలను కేటాయించుటకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వబోతుందన్నారు. జిల్లాలో 129 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించబోతున్నామన్నారు. దరఖాస్తు చేయు వ్యక్తులు సదరు మద్యం దుకాణాలకు సంబంధించిన ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దరఖాస్తులు చేసుకోవచ్చునని అన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలన్నీ గెజిట్ వచ్చిన తరువాత వివరించడం జరుగుతుందని చెప్పారు. ఇందుకు సంబంధించి జిల్లా ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ, లాటరీ నిర్వహించు విధానం కలెక్టర్‌కు వివరించారు.

# ఎక్సైజ్ శాఖలో సీఐల బదిలీలు

నెహ్రూనగర్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో సీఐలను బదిలీలు చేస్తూ ఆ శాఖ డైరెక్టర్ నిశాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు- 1 సీఐగా బి.లత, గుంటూరు- 2కు ఎం. యశోధరాదేవి, ప్రత్తిపాడుకు వై. అశోక్‌కుమార్, మంగళగిరికి జి. వీరాంజనేయులు, తెనాలికి ఏ.వి.చలం, పొన్నూరుకు ఎం.రమేష్, బాపట్లకు పి.గీతిక, రేపల్లెకు ఆర్.దివాకర్, వేమూరుకు ఎ.రవి, నగరానికి ఎం.శ్రీరామ్‌ప్రసాద్, చీరాలకు పి.నాగేశ్వరరావు, పర్చూరుకు ఎం. భుజంగరావు, అద్దంకి ఎ.భువన, చిలకలూరిపేటకు కొడాలి వినయ్‌కుమార్, సత్తెనపల్లికి పి. విజయ్‌కుమార్, క్రోసూరుకు టి.తులసి, పిడుగురాళ్లకు కె.కర్ణ, గురజాలకు కె.బుజ్జిబాబు, మాచర్లకు ఎన్.వెంకటరమణ, వినుకొండకు డి.శ్రీనివాసరావు, ఈపూరుకు డి.వెంకటేశ్వర్లు, పెదకూరపాడుకు వి.శ్రీనివాసులును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**ఎస్ఐల బదిలీలు**

గుంటూరు- 1 ఎక్సైజ్ ఎస్ఐలుగా ఎండీ. ఖాశీం షరీఫ్, పి తిరుమలేశ్వరరావు, గుంటూరు -2కు సీహెచ్.మాధవి, పి.ఆర్.కె.మూర్తి, కె. సత్యనారాయణ, ప్రత్తిపాడుకు ఎం. రవీంద్రబాబు, మంగళగిరికి ఎ.పద్మజ, కె. రవికుమార్, జె. భాస్కర్‌రావు, తెనాలికి టి. ఫణికుమార్, ఆర్. శ్రీనివాసరావు, పొన్నూరుకు జి. శివరామ్‌ప్రసాద్ నియమితులయ్యారు.

ఏపీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐలుగా ఎస్‌డీ హెచ్ రెహమాన్, ఎన్ శ్రీనివాసరావు, ఈఎస్‌టీఎఫ్ గుంటూరు ఎస్ఐగా పి.కృష్ణారెడ్డి, ఐఎంఎల్ గుంటూరు డిపో ఎస్ఐగా ఎ.శశికుమార్, నరసరావుపేట ఎస్ఐలుగా టి. తారాలక్ష్మి, కె.మురళీకృష్ణ, చిలకలూరిపేటకు సీహెచ్.దయాకర్, ఎం.గురవేశ్వరి, సత్తెనపల్లికి కె.నాగలక్ష్మి, క్రోసూరుకు టి.శ్రీనివాస్, పిడుగురాళ్లకు కె.కిరణ్‌కుమార్, గురజాలకు ఆర్.వి.వి.ప్రసాద్, మాచర్లకు ఎండీ.యాకుబ్ షరీఫ్, వినుకొండకు సీహెచ్.వినీల, డి.శ్రీనివాసరావు, ఈపూరుకు కె.శ్రీనివాసరావు, పిడుగురాళ్లకు డి.పీర్‌హుస్సేన్, నరసరావుపేట ఈఎస్‌టీఫ్ ఎస్ఐగా ఈ.కళ్యాణ్‌చక్రవర్తి, నరసరావుపేట ఐఎంఎల్ డిపో ఎస్ఐగా జె.మాధవి, విజయపురి సౌత్ చెక్ పోస్ట్ ఎస్ఐగా ఎస్.వి.సుబ్బారావు, పొందుగల చెక్‌పోస్ట్ ఎస్ఐగా సీహెచ్ అనిల్‌కుమార్‌లను నియమిస్తూ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు.

### నాణేలను తిరస్కరించ వద్దు

కొరిటెపాడు(గుంటూరు): చలామణిలో ఉన్న నాణేలను తిరస్కరించొద్దని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి సూచించారు. అలా తిరస్కరించే వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన సోమవారం 'సాక్షి'తో మాట్లాడారు. నాణేలను ఆర్థిక, సామాజిక, సాంస్కృతికత, కాలానుగుణంగా విడుదల చేస్తారని తెలిపారు. ప్రస్తుతం 1, 2, 5, 10 రూపాయల నాణేలు చలామణిలో ఉన్నాయని తెలిపారు. ఈ నాణేల వాస్తవికతపై కొన్ని వర్గాల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని, దీంతో వ్యాపారులు, దుకాణదారులు వీటిని తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా రూ.10 నాణేలను తిరస్కరిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని బ్యాంక్ శాఖల్లోనూ నాణేలను మార్పిడి చేసుకోవచ్చని చెప్పారు. ఈ మేరకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా 2019 జనవరి 14న ప్రత్యేకంగా బ్యాంకులకు సూచనలు ఇచ్చిందని ఎల్‌డీఎం తెలిపారు.

# మద్యం దుకాణాలపై 'కూటమి' కన్ను

- నీకిది .. నాకది అంటూ పంపకాలు
- ఒక్కో దుకాణానికి ఆరుగురు దరఖాస్తు చేసేలా ఆదేశాలు
- ఎవరికి వచ్చినా అందరూ సిండికేట్‌గా వ్యాపారం
- జిల్లాలో 118 మద్యం దుకాణాలు, 53 బార్ అండ్ రెస్టారెంట్‌లు

సత్తెనపల్లి: మద్యం దుకాణాలపై కూటమి నేతలు కన్నేశారు. సిండికేటుగా వ్యాపారం చేసేందుకు రంగంలోకి దిగుతున్నారు. నీకిది ..నాకది అంటూ పోటీపడుతూ జిల్లాలోని ఎమ్మెల్యేల వద్దకు క్యూ కడుతున్నారు. ఇద్దరు ముగ్గురు కలిసి మద్యం దుకాణాన్ని దక్కించుకొని సిండికేట్‌గా వ్యాపారం చేసేందుకు వ్యూహాలకు పదును పెడుతూ కాసులు సిద్ధం చేసుకుంటున్నారు. మద్యం దుకాణాలకు చెల్లించాల్సిన దరావత్తు కూటమి ప్రభుత్వం భారీగా నిర్ణయించనుందని సమాచారం. తెలంగాణ ప్రభుత్వం రూ. 2 లక్షలు పెట్టినందున ఇక్కడ కూడా ప్రభుత్వం అదే విధానం అవలంబిస్తుందని అంచనా. ధరావత్తు సొమ్ము తిరిగి ఇచ్చే అవకాశం లేనందున, ఇంత పెద్ద మొత్తంలో సొమ్ము చెల్లించి డ్రా విధానంలో షాపులు దక్కకపోతే మొత్తం సొమ్ములు నష్టపోతామని తెలుగు తమ్ముళ్లు ఎమ్మెల్యేల వద్ద వాపోతున్నారు. ఈ క్రమంలో ఓ సీనియర్ ఎమ్మెల్యే ఒక్కో దుకాణానికి ఆరుగురు మాత్రమే దరావతు చెల్లించి దరఖాస్తు చేయాలని, వీరిలో ఏ ఒక్కరి పేరుతో వచ్చినా ఆరుగురు కలిసి భాగస్వాములుగా వ్యాపారం చేసుకోవాలని నిర్ణయించారు. మరో జూనియర్ ఎమ్మెల్యే మద్యం దుకాణాల వ్యవహారం మొత్తం చూసుకునేలా ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆ వ్యక్తి ఈ వ్యవహారంలో బిజీగా గడుపుతూ కాసులు సమకూర్చే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో 100 శాతం మద్యం దుకాణాలు కూటమినేతల సిండికేట్ దారులు పొందే అవకాశం ఏర్పడనుంది.

**జిల్లాలో ఇలా...**

జిల్లావ్యాప్తంగా 96 మద్యం దుకాణాలు, 7 వాక్ ఇన్ లిక్కర్ స్టోర్స్, 15 టూరిజం మద్యం దుకాణాలు, 53 బార్ అండ్ రెస్టారెంట్లు నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బార్ అండ్ రెస్టారెంట్‌లను బలవంతంగా లాగేసుకున్నారు. కొన్ని చోట్ల ధ్వంసం చేసి మధ్యవర్తిత్వం దారా రాబట్టుకున్నారు. కొత్త పాలసీ పేరుతో ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులు, కూటమి నేతలకు మద్యం దుకాణా లను కట్టబెడుతుంది. ఇందులో భాగంగా ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న మద్యం దుకాణాలన్నీ ప్రైవేటుకు కట్టబెడతారు.

## క్లుప్తంగా

### దాసుకు గుర్రం జాషువా పురస్కారం



క్రోసూరు: గ్రామానికి చెందిన ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు గార్లపాటి దాసుకు 'గుర్రం జాషువా తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' అవార్డు ఆదివారం అందుకున్నారు. విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ ఆధ్వర్యంలో జాషువా జయంతి, కళా పరిషత్ 36వ వార్షికోత్సవం నిర్వహించారు. కళా పరిషత్ అంతర్జాతీయ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ పెద్దిటి యోహాన్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. పలువురు అభినందించారు.

### సాహితీవేత్త అనిల్‌కుమార్‌కు..



గుడివాడ టౌన్: సామాజిక అసమానతలపై కలం ఝులిపించిన నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా అని పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎంఎస్‌ఏ దివాకర్ అన్నారు. స్థానిక శ్రీనివాస మహల్ సెంటర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని సోమవారం సాహితీ పురస్కారాన్ని పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన సాహితీవేత్త డి.అనిల్‌కుమార్‌కు గుర్రం జాషువా స్ఫూర్తి పురస్కారం- 2024 అందజేశారు. డాక్టర్ దివాకర్ మాట్లాడుతూ సమాజంలోని మానసిక రుగ్మతలకు అద్దం పడుతూ ప్రతిఒక్కరినీ చైతన్యపథం వైపు నడిపించిన గొప్ప కవి గుర్రం జాషువా అన్నారు. వారిని సమాజం ఆదర్శంగా తీసుకోవాలని ఆయన భావాలను వెలుగులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో తెలుగు భాషా వికాస సమితి సమన్వయకర్త డీఆర్‌బీ ప్రసాద్, సీహెచ్ రూప, బండి గోవర్ధనరావు, బి.నాగేశ్వరరావు, అవిర్నేని వెంకటేశ్వరరావు, జి. రామకృష్ణ, పీవీ సత్యనారాయణ, వసుధ బసవేశ్వరరావు, ఎస్. సాంబశివరావు పాల్గొన్నారు.

# నరసరావుపేట డీఎస్పీపై చర్యలు తీసుకోవాలి

**కలెక్టరేట్ ఎదుట బాధితులు, కేఎన్‌పీఎస్ నాయకుల ధర్నా**



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు, కేఎన్‌పీఎస్ నాయకులు

నరసరావుపేట: నిందితుడిపై అట్రాసిటీ కేసు నమోదు చేయకుండా కాపాడుతున్న నరసరావుపేట డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కులనిర్మూలనా పోరాట సమితి(కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ మాట్లాడుతూ చిలకలూరిపేట రూరల్ మండలం యడవల్లి గ్రామానికి చెందిన ఉయ్యాల ఏడుకొండలు ఇంటిని పొక్లెయిన్‌తో కూల్చిన టీడీపీ వారిని అరెస్టు చేయకుండా కాపాడుతున్న డీఎస్పీ కె.నాగేశ్వరరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతనెల 18న యడవల్లి ఎస్టీ కాలనీలో ఉన్న ఉయ్యాల ఏడుకొండలు ఇంటిని కూల్చి, వారిని కులం పేరుతో దూషించి దాడిచేసిన టి.గోవిందరాజు అతడి బంధువులను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. అయితే కేసులో స్థానిక ప్రజాప్రతినిధి ఆదేశాలకు తలొగ్గిన డీఎస్పీ నిందితులను అరెస్టు చేయకుండా కాపాడడం సిగ్గుచేటు అన్నారు. రెండు రోజులుగా బాధితులను జిల్లా కలెక్టర్, ఎస్పీలను కలవనీయకుండా గ్రామంలో నిర్బంధించి, స్టేషనకు తరలించి వారితో బలవంతంగా సంతకాలు తీసుకున్న డీఎస్పీ చట్టవ్యతిరేక చర్యలను తీవ్రంగా ఖండించారు. ఈ కేసు విచారణ పరిధి నుంచి డీఎస్పీని తొలగించి మరొక నిజాయతీ అధికారితో విచారణ జరిపించాలని కోరారు. గోవిందరాజు అతని బంధువులను వెంటనే అరెస్టు చేయాలని, బాధితులపై పెట్టిన తప్పుడు కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సమస్యను జిల్లా అదనపు ఎస్పీకి తెలియజేయగా ఆయన డీఎస్పీపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ కార్యదర్శి కె.నాగేశ్వరరావు, సిహెచ్.రాజశేఖర్, కొయ్యలమూడి జయమ్మ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బి.కొండారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు, శిఖినం సాంబయ్య, గుంటూరు నగర కార్యదర్శి నన్నం పోతురాజు, సభ్యులు బయ్యవరపు సతీష్, నాగిపోగు శ్రీనివాసరావు, వర్ల ఝాన్సీ, దేవంగి దయామణి,, శ్రీలక్ష్మి, చైతన్య గ్యాస్ వర్కర్స్ యూనియన్ నాయకుడు చలపతిరావు పాల్గొన్నారు.

# ఆస్తి కోసం తండ్రికి వేధింపులు

- కొడుకు నుంచి రక్షణ కల్పించాలని వినతి
- ఎస్పీ ప్రజావేదికలో 67 అర్జీల స్వీకరణ
- హాజరైన అదనపు అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్



ఏఎస్పీకి సమస్యలు వివరిస్తున్న బాధితులు

నరసరావుపేట: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా అదనపు అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్ అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి 67 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వాటిలో కుటుంబ, ఆర్థిక, ఆస్తి, మోసం సమస్యలకు సంబంధించినవి ఉన్నాయి. ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు.

### తండ్రికి బెదిరింపులు

నాకు ఇద్దరు కుమారులు, ఆస్తి ఇద్దరికి సమానంగా ఇచ్చాను. నేను పోషణ నిమిత్తం రెండు ఎకరాలు ఉంచుకున్నా. నా పెద్ద కుమారుడు, అతడి భార్య పొలం కౌలుకు ఇవ్వనీయకుండా అడ్డుపడుతూ పొలం వారిపేరుపై రాయాలని బెదిరిస్తున్నారు. నాకు వారి నుంచి రక్షణ కల్పించండి.

–జి.వెంకటేశ్వర్లు, చిన మక్కెన, పెదకూరపాడు

### ఉద్యోగం ఇప్పిస్తానని రూ.1.30 లక్షల మోసం

మా పిల్లలకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ గంగాధరరావు అనే వ్యక్తికి రూ.1.30 లక్షలు ఇచ్చాం. ఉద్యోగం ఇప్పించకపోవటంతో ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరితే బెదిరిస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకోండి.

–షేక్ మౌలాలి, నబీ రసూల్, కస్తల గ్రామం, అచ్చంపేట మండలం

### మోసం చేసి పొలం మొత్తం రాయించుకున్నారు

నాకు రాజరాజేశ్వరీనగర్‌లో 5.89 ఎకరాల పొలం ఉంది. అందులో 89 సెంట్లు విక్రయించేందుకు రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లగా పొలం కొనుగోలు చేసిన అనూరాధ 89 సెంట్లతో పాటు ఐదు ఎకరాలు మోసం చేసి రాయించుకుంది. ఆమెపై చర్యలు తీసుకోని నా పొలం ఇప్పించండి.

–చంద్ర రవీంద్రబాబు, రాజేశ్వరీనగర్, నరసరావుపేట

# కుస్తీ పోటీల రాష్ట్రస్థాయి జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, పీడీలు, పీఈటీలు

అచ్చంపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో సోమవారం జిల్లా స్థాయి రెజ్లింగ్(కుస్తీ) పోటీలు నిర్వహించారు. అండర్- 14, అండర్ - 17 విభాగాలలో బాలుర, బాలికల రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు.

**అండర్- 14 బాలికల విభాగంలో..** విజయపురిసౌత్‌కు చెందిన బాలికలు ఎం.అనూష, బి.అలేఖ్య, ఎం.పూజిత, ఎస్.మేరీలేఖ, కె.నందిని ఎంపికయ్యారు. బాపట్లకు చెందిన శరణ్య, పి.రోజ,కె.శ్రీజ, అమరావతికి చెందిన ప్రవల్లిక ఎంపికయ్యారు.

**అండర్- 14 బాలుర విభాగంలో..** అచ్చంపేటకు చెందిన పి.నాగచైతన్య, డి.గౌరిప్రతాప్, ఎ.ప్రణీత్, వై.మదన్, డి.సందీప్, అడవితక్కెళ్లపాడుకు చెందిన ఎం.జామ్‌నాయక్, ప్రిన్సి, వి.ప్రవీణ్‌కుమార్, కె.అంకితరాజు, బి.సూర్యకృష్ణలు ఎంపికయ్యారు.

**అండర్- 17 బాలికల విభాగంలో..** విజయపురిసౌత్‌కు చెందిన పి.కావ్య, బి.మాధురి, ఆర్.అనూష, ఎ.సంధ్య, అమరావతికి చెందిన ఎస్.పూజా మహేశ్వరి, బి.లక్ష్మి, బాపట్లకు చెందిన సీహెచ్ రోస్లిన్, కె.రోజా, జి.అమూల్య, డి.ప్రిన్సి ఎంపికయ్యారు.

**అండర్- 17 బాలుర విభాగంలో..** అచ్చంపేట గురుకుల పాఠశాలకు చెందిన ఎ.బాబు, కె.గోపయ్య, వి.వృద్ధి, బి.సంతోష్, కేవీఎల్ చక్రధర్, జి.జాన్సన్, డి.సుంధీర్, బి.ధనూష్, ఎం.వెంకటేష్, జి.డేవిడ్, ఎస్.వంసి, కె.అశోక్‌కుమార్, ఎం.వరప్రసాద్, డి.కుమార్‌బాబు, జె.కె.రామ్, జి.రాజు, తాటికొండకు చెందిన జి.చరణ్‌తేజ, అడవితక్కెళ్లపాడుకు చెందిన టి.పవన్‌కుమార్, అచ్చంపేట బ్లూబెల్స్ హైస్కూల్‌కు చెందిన వి.మహాదేవ్ ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు అక్టోబర్ 3,4,5 తేదీలలో కృష్ణా జిల్లాలోని నున్నలోని జిల్లా పరిషత్ హైస్కూలులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని రిటైర్డు పీడీ జి.భూషణం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ అరుణకుమార్ అభినందించారు.

# లైంగిక దాడికి పాల్పడిన వార్డెన్ కులాన్ని నిర్ధారించాలి

**కలెక్టరేట్ ఎదుట బాధితురాలి తల్లి, ప్రజాసంఘాల ధర్నా**



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న బాధితురాలి తల్లి, ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: దళిత బాలికపై లైంగిక దాడి చేసి అబార్షన్ చేయించిన వై.శ్రీనివాసరావు కులాన్ని త్వరగా నిర్ధారించి అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి బాధితురాలికి న్యాయం చేయాలని ఆ బాలిక తల్లితండ్రులు, ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. బాలిక తల్లి మీడియాతో మాట్లాడుతూ 2022లో తన కుమార్తె మాచర్ల సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్‌లో చదువుతుండగా హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు బెదిరించి లైంగికదాడి చేసి అబార్షన్ చేయించాడన్నారు. అతడిపై ఫిర్యాదు చేస్తే తాను ఎస్టీ కులానికి చెందిన వాడిగా చెప్పుకొని అట్రాసిటీ కేసు నుంచి తప్పించుకున్నాడన్నారు. వాస్తవానికి అతను ముదిరాజు కులానికి(బీసీ–డి) చెందిన వాడని, అయితే అధికారులను తప్పుదోవ పట్టిస్తూ ఎస్టీగా చెప్పుకుంటూ తిరుగుతున్నాడని పేర్కొన్నారు. అతను ముదిరాజు కులస్తుడని తహసీల్దార్ నివేదిక ఇచ్చినట్లు వివరించారు. అందువలన కలెక్టరేట్‌లోని డీఎల్ఎస్‌సీ కమిటీ అతడి కులాన్ని త్వరగా నిర్ధారించి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జి.రామకృష్ణ, షేక్ మస్తాన్‌వలి, అబ్రహాంలింకన్, ఏపీ గిరిజన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటా నాయక్, ఎంసీపీఐ జిల్లా అధ్యక్షులు కృష్ణ, పౌరహక్కుల సంఘ జిల్లా సంయుక్త కార్యదర్శి శికినం చిన్న పాల్గొన్నారు.



# బాధితులకు రక్షణ కల్పించాలి

**కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ**



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: దళిత యువకులపై విచక్షణారహితంగా దాడి చేసిన అగ్రవర్ణులను వెంటనే అరెస్టు చేసి బాధితులకు రక్షణ కల్పించాలని కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ డిమాండ్ చేశారు. రాజుపాలెం మండలం గణపవరం యువకుల దాడిలో గాయపడి సత్తెనపల్లి గవర్నమెంట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గడ్డిపర్తి సురేష్, పారనంది మరియదాసు, కటారి లక్ష్మయ్య, గడ్డిపర్తి సాల్మన్‌లను దళిత గిరిజన బడ్జెట్ వాచ్ ప్రతినిధులు మల్లెల చిన్నప్ప, మేడే వెంకటరమణ, మరియదాసు, దాసు, కేఎన్‌పీఎస్ సభ్యులు రాపూరి కిషోర్, చందులతో కలసి సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 11 గంటలకు గణపవరం గ్రామంలో వైన్ షాప్ వద్ద ఉన్న చికెన్ షాపుకు వెళ్లినట్లు వివరించారు. ఆ సమయంలో నల్లూరి మోహన్, అతని కుమారుడు శ్రీను, ప్రసాద్, నల్లూరి శ్రీను, తమ గ్రామానికి చెందిన తాళ్లూరి రామనాథ్(మాదిగ) గొడవ పడుతున్నారని చెప్పారు. ఆ నలుగురు అడ్డం వెళ్లి గొడవెందుకని సర్ది చెప్పగా అది సహించలేని అగ్రవర్ణ కుల దురహంకారులు తమను కులం పేరుతో దూషించి దాడి చేశారన్నారు. నలుగురు యువకులను కనీసం ఒక కిలో మీటరు దూరం కొట్టుకుంటూ, ఈడ్చుకుంటూ వెళ్లి గ్రామం నడిబొడ్డున ఉన్న లైబ్రరీ గదిలో బంధించి ఒకరి వెంట ఒకరు గదిలోకి వచ్చి చెప్పులతో కొట్టారన్నారు. కాళ్ల చేతులతో ఇష్టం వచ్చినట్టు కొట్టారన్నారు. మహిళలను అవమానించారని, సుమారు వంద మంది చేసిన ఈ దాడిలో కేవలం నలుగురు అగ్రవర్ణ కులస్తులు పైన మాత్రమే రాజుపాలెం పోలీసులు ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని పై కృష్ణ మాట్లాడుతూ మాదిగ యువకులపై అగ్రవర్ణ కుల దురహంకారుల అమానుష దాడిని తీవ్రంగా ఖండించారు. పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు.

# రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

**మరో యువకుడికి గాయాలు**



మృతి చెందిన ఉమర్ (ఫైల్)



ప్రమాదంలో ధ్వంసమైన బైక్

చిలకలూరిపేట: రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి అకాల మృత్యువాత పడిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని గుర్రాలచావిడి ప్రాంతానికి చెందిన షేక్ ఖయ్యూమ్, నసీమా దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. వీరిలో పెద్దవాడైన షేక్ మొహమ్మద్ ఉమర్(19) గుంటూరు సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ కళాశాలకు చెందిన హాస్టల్‌లో ఉంటున్నాడు. రెండు రోజుల కిందట ఇంటికి వచ్చిన ఉమర్ ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి కళాశాలకు వెళ్తున్నట్లు చెప్పి బయలు దేరాడు.

**మిత్రుడి జన్మదిన కారణంగా...**

ఇంటి నుంచి బయలు దేరిన ఉమర్ ఓ మిత్రుడి జన్మదిన వేడుకలు ఉండటంతో మిత్రుల ఒత్తిడిపై నేరుగా కళాశాలకు వెళ్లలేదు. సాయంత్రం మిత్రుడి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నాడు. అక్కడి నుంచి మిత్రులంతా కలసి సెకండ్ షో సినిమాకు వెళ్లారు. సినిమా అయిపోయాక మరో మిత్రుడి సయ్యద్ షోయబ్‌తో కలసి స్కూటీపై బొప్పూడి ఆంజనేయస్వామి గుడి సమీపంలోని ఓ దాబాలో టిఫిన్ చేసేందుకు ఒంగోలు రోడ్డులో వెళుతున్నాడు. ఒంగోలు రోడ్డులోని రిలయన్స్ పెట్రోల్ బంకు సమీపంలోకి చేరుకున్నారు. అదే సమయంలో ఒంగోలు వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు మధ్య డివైడర్ ఎక్కి పక్కరోడ్డులో ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మొహమ్మద్ ఉమర్ అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చొన్న షోయబ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఉమర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన షోయబ్‌ను మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చదువు పూర్తి చేసుకొని వృద్ధిలోకి వస్తాడనుకున్న కుమారుడు కానరాని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనతో గుర్రాలచావిడి ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోస్టు మార్టం అనంతరం ఉమర్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.



# షూటింగ్ బాల్, బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన షూటింగ్‌బాల్ టీమ్



ఎంపికైన బాల్‌బాడ్మింటన్ టీమ్

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జూనియర్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికలు సోమవారం నిర్వహించారు. ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ ఎంపికల్లో జి.నాగ హనుమాన్, ఎస్.భార్గవ్, వై.ఎస్.లిఖిత్‌రెడ్డి, ఎం.జీవన్ రెడ్డి, కె.హరిహర, వీ.నరేష్, టి. కిషోర్, డి.నారాయణ, జి.శశి, వై.సునీల్‌కుమార్, టి.మధు, ఎస్.భార్గవ్ ఎంపికయ్యారు. బాలికల టీమ్‌లో టి.భార్గవి, జి.హేమలత, ఎం.నందిని, పి.సుచిత్ర, పి.మేఘన, ఎస్.సావిత్రి, ఎల్.గ్లోరీ, ఎన్.మనుష, పి. పావని, సీహెచ్.అక్షర, ఎం.శ్రీలక్ష్మి మహేశ్వరి, పి.సులోచనరాణిలు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 6,7,8 తేదీలలో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పల్నాడు జిల్లా షూటింగ్ బాల అసోసియేషన్ కార్యదర్శి కోనంకి కిరణ్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్–19 ఆధ్వర్యంలో బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం జరిగాయి.

# రైతులను ముంచిన కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యం

- ఆందోళనలో గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాలకు చెందిన మిర్చి రైతులు
- రైతుల మిర్చి బస్తాలపై బ్యాంకుల నుంచి రుణాలు
- రూ.15 కోట్లకుపైగా టోకరా
- రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్ ఎదుట బాధిత రైతుల ఆందోళన

గుంటూరు రూరల్: ఆరుగాలం శ్రమించి కష్టపడి చెమటోడ్చి పండించిన పంటను మిర్చి ఎగుమతిదారుడిని నమ్మి కోల్డ్ స్టోరేజ్‌లో ఉంచితే రైతులకు తెలియకుండా అమ్ముకున్నాడు. పైగా కొందరి రైతుల మిర్చిపై బ్యాంకులో రుణాలు పొంది వారిని కలిసేందుకు కూడా అనుమతి ఇవ్వలేదు. దీంతో బాధిత రైతులు సోమవారం నల్లపాడు రోడ్డులోని రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్ వద్ద ఆందోళన చేశారు. కుమార్ స్పైసెస్‌కు చెందిన బచ్చనబోయిన రామచంద్రరావు నిల్వ చేసుకున్న మిర్చి బస్తాలను తెలియకుండా విక్రయించుకున్నాడని, అదేమని అడిగితే సమాధానం చెప్పడం లేదని రైతులు వాపోయారు. బాండ్‌లను బ్యాంకులో తనఖా పెట్టి రుణాలు పొందారని ఆందోళన వ్యక్తం చేశారు.

**బాధితులు కన్నీరుమున్నీరు**

కర్నూలు జిల్లా దేవులపాడుకు చెందిన రైతు మారయ్య తన 210 బస్తాలను కోల్డ్ స్టోరేజ్‌లో ఉంచితే వాటిని అమ్ముకున్నారని విలపించాడు. అదే జిల్లాకు చెందిన ఎం.రామాంజనేయులు 230 బస్తాలు, కుమారస్వామి 200 బస్తాలు జాడలేకుండా పోయాయని తెలిపారు. ప్రకాశం జిల్లా మల్లవరం గ్రామానికి చెందిన ఎం. గోవర్ధన్ 300 బస్తాలు, దుగ్గెంపూడి రామిరెడ్డి 130 బస్తాలు, డి. వెంకటేశ్వర్‌రెడ్డి 110 బస్తాలు, ఓబులపతి 180 బస్తాలు, కె శ్రీనివాసరెడ్డి, ఉపేంద్రరెడ్డిలకు చెందిన సుమారు రూ 4 లక్షల రూపాయలు మిర్చిని మాయం చేశారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు. గత మూడు నెలలుగా కోల్డ్ స్టోరేజ్‌కు వస్తున్నా పట్టించుకోవటంలేదని, కనీసం తమ సరుకుని చూపించాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అదేమని అడిగితే రామచంద్రరావు అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్నాడని సమాధానం చెబుతున్నారని వాపోయారు. నాలుగు జిల్లాలకు చెందిన వందలాది మంది రైతులకు చెందిన మిర్చి బస్తాలు సుమారు రూ. 15 కోట్లకు పైగా ఉంటాయని తెలిపారు. ఇందులో ఎన్ని అమ్ముకున్నారో, ఎన్ని బస్తాలపై రుణాలు పొందారో తెలియడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు కలుగజేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

# పది నిమిషాల్లో వస్తున్నానని అనంతలోకాలకు..



మనోజ్ (ఫైల్)

తాడేపల్లి రూరల్: పది నిమిషాల్లో వస్తున్నానన్నకొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. ఎన్‌టీఆర్ జిల్లా, విజయవాడ కృష్ణలంక బాలాజీ నగర్‌కు చెందిన సుధాబత్తుల శ్రీనివాసరావు, నాగలక్ష్మి దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడైన కృప మనోజ్(21) డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. కొడుక్కి ఉద్యోగం వస్తే చేదోడు వాదోడుగా ఉంటాడని ఫౌండ్రీ పని చేసుకునే శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు భావించారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై కృప మనోజ్ వారధి మీదుగా తాడేపల్లికి వచ్చాడు. 11.30 సమయంలో ఇంటికి తిరిగి వెళుతుండగా గుంటూరు–విజయవాడ రహదారిలోని కనకదుర్గ వారధి 16వ నంబర్ పిల్లర్ వద్ద వెనుక నుండి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృప మనోజ్ రోడ్డుపై పడడంతో ఒకవైపు శరీరంపై లారీ టైర్ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి రోడ్డుపై మృతి చెందిన వ్యక్తి మనోజ్‌గా గుర్తించారు. మృతుడి జేబులో ఉన్న ఫోన్‌కు స్నేహితుల దగ్గర నుంచి ఫోన్ రావడంతో జరిగిన విషయం చెప్పడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు వచ్చిన మనోజ్ తల్లి నాగలక్ష్మి గుండెలు పగిలేలా రోదించింది. ''పది నిమిషాల్లో ఇంటికి వస్తానని చెప్పి మాకు కడుపుకోత మిగిల్చి.. అంతులేని లోకాలకు వెళ్లావా !'' అంటూ మృతదేహంపై పడి దుఃఖించింది. పోలీసులు, బంధువులు ఆమెను సముదాయించి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.